సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

SK1 one NEWS HD

# శ్రీ సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 165 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | గురువారం 03-09-2026

రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే

# 'జై కొట్టు' యువజన విభాగం




- జనసేన యువజన విభాగం 'జై కొట్టు' లోగో ఆవిష్కరణ
- యువతకు ఛాన్స్
- "చెయ్యెత్తి జై కొట్టు" నినాదం మనందరినీ ఎంతో కదిలిస్తుంది
- రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే యువజన విభాగం ఏర్పాటు చేశామన్న మంత్రి నాదెండ్ల మనోహర్
- జనసేన యువజన విభాగానికి 'జై కొట్టు'గా నామకరణం
- పిఠాపురంలో లోగోను ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- ఆడియో సందేశం ద్వారా శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్
- పవన్ జన్మదిన వేడుకలతో కలిసి ఘనంగా జరిగిన కార్యక్రమం

**అమరావతి :**

యువతరానికి జనసేన జై కొట్టింది. ఆ పార్టీ యువజన విభాగానికి "జైకొట్టు" అని నామకరణం చేసింది. పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 'జై కొట్టు' లోగో పిఠాపురంలో ఆవిష్కరించారు. కేరళలో చికిత్స తీసుకుంటున్న కారణంగా ఈ సభకు రాలేకపోయిన పవన్ కల్యాణ్ శ్రేణులకు ఆడియో సందేశం ఇచ్చారు. రాజకీయాల్లో యువతకు అవకాశాలు కల్పించేందుకే ఈ వేదిక ఏర్పాటు చేసినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "చెయ్యెత్తి జై కొట్టు" నినాదం మనందరినీ ఎంతో కదిలిస్తుందన్నారు. ఆ స్ఫూర్తిని మీకు అందించాలనే అధినేత పవన్ ఈ లోగో పెట్టారని కార్యక్రమంలో పాల్గొన్న వారితో నాదెండ్ల మనోహర్ అన్నారు. జై కొట్టు నినాదంతో ముందు కెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే ఈ విభాగాన్ని ఏర్పాటు చేశామని మంత్రి నాదెండ్ల అన్నారు. అరుపులు, కేకలు కాదు క్రమశిక్షణ - మిగతా 2 లో

# ఉత్తరాంధ్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం

- అనకాపల్లి గడ్డను ముద్దాడిన గోదావరి జలాలు
- పోలవరం ఎడమ కాలువ నుంచి నీరు విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- పాయకరావుపేట వద్ద రెగ్యులేటర్ ఆన్ చేసి నీటి విడుదల
- పోలవరం ఎడమ కాలువలో గోదారమ్మకు జలహారతి పట్టి ఆహ్వానం



**అమరావతి :**

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ తూర్పు కనుమలను దాటుకుంటూ ఉత్తరాంధ్ర నేలను పలకరించింది. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు చేరుకున్నాయి. నదులు, - మిగతా 2 లో

# వైఎస్సార్ 17వ వర్ధంతి ఇడుపులపాయలో జగన్ నివాళి

- తండ్రి సమాధి వద్ద అంజలి ఘటించిన వైఎస్ జగన్
- కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ విజయమ్మ, భారతి, కుటుంబ సభ్యులు
- వైఎస్సార్‌ను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు



**అమరావతి :**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంజలి ఘటించారు. తన తల్లి వైఎస్ విజయమ్మ, భార్య భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సమాధిని పుష్పగుచ్ఛాలతో అలంకరించి, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూడా ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహానేతను స్మరించుకుంటూ వారు అంజలి ఘటించారు. 2004 నుంచి 2009 - మిగతా 2 లో

# ఆగ్రాలో ఇద్దరికి ఎబోలా పాజిటివ్



- ఆగ్రాలో ఇద్దరికి సోకిన ఎబోలా
- ఉత్తరప్రదేశ్‌లో ఆసుపత్రులను హై అలర్ట్
- వారికి, వారి కుటుంబాలను ఐసోలేషన్‌లో ఉంచిన వైద్యులు
- ఇద్దరు వ్యక్తులు దిల్లీ, ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాలకు వెళ్లినప్పుడు పరీక్ష చేయగా ఎబోలా పాజిటివ్ అని తేలింది

**ఢిల్లీ :**

కాంగో నుంచి భారత్‌లోని ఆగ్రాకు వచ్చిన ఇద్దరు వ్యక్తులకు ఎబోలా వైరస్ సోకింది. దీనితో ఉత్తరప్రదేశ్‌లో ఆసుపత్రులను హై అలర్ట్ చేశారు. ఈ వైరస్ ఇతరులకు వ్యాపించకుండా నిరోధించేందుకు అధికారులు ఆ ఇద్దరిని, వారి కుటుంబాలను ఐసోలేషన్‌లో ఉంచారు. ఆగ్రా ఇన్‌ఛార్జ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) డాక్టర్ అమిత్ రావత్ మాట్లాడుతూ, "ఈ ఇద్దరు వ్యక్తులు దిల్లీ, ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాలకు వెళ్లినప్పుడు, వారి నుంచి స్క్రీనింగ్ నమూనాలను సేకరించారు. పరీక్ష చేయగా ఎబోలా పాజిటివ్ అని తేలింది. దీనితో మేము నిపుణుల బృందాలను అప్రమత్తం - మిగతా 2 లో

# సిక్కింలో 40 ప్రమాదకర సరస్సులు గుర్తింపు

- సిక్కింను వెంటాడుతున్న హిమ సరస్సుల ముప్పు
- రాష్ట్రంలో 40 ప్రమాదకర సరస్సులను గుర్తించిన అధికారులు
- వీటిలో 7 అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక
- నేపాల్ వరదల నేపథ్యంలో అప్రమత్తమైన యంత్రాంగం - మిగతా 2 లో

# భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి


- నేపాల్ ఆకస్మిక వరదల వల్ల ఇప్పటి వరకు 11 వందల మందికి పైగా మృతి
- పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము మూల్యం చెల్లించుకుంటున్నామన్న నేపాల్
- తమకు నష్టపరిహారం చెల్లించడం చట్టపరమైన బాధ్యత అని వ్యాఖ్య



**ఢిల్లీ :**

నేపాల్‌ను ముంచెత్తిన ఘోర జలప్రళయం తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వేళ, ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై కీలక విజ్ఞప్తి చేసింది. ప్రపంచంలోనే అత్యధికంగా గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తున్న భారత్, చైనా, అమెరికా దేశాల నుంచి 'వాతావరణ మార్పుల నష్టపరిహారం' కోరుతూ నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ సంచలన ప్రకటన చేశారు. భోటేకోషి నదిలో - మిగతా 2 లో

# తమిళనాడు ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం




- అమల్లోకి కొత్త నిబంధన
- తమిళనాడులోని 52 ప్రధాన ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం
- దర్శనానికి ముందు కౌంటర్‌లో ఫోన్ డిపాజిట్ చేయడం తప్పనిసరి
- ఆలయ పవిత్రత, ప్రశాంతతను కాపాడేందుకే ఈ నిర్ణయం
- కెమెరా లేని సాధారణ ఫోన్లకు మాత్రం అనుమతి

**చెన్నై :**

తమిళనాడులోని ప్రధాన దేవాలయాల్లో భక్తుల స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హిందూ మత, ధర్మాదాయ - మిగతా 2 లో



# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం ఆపలేదు
- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సామాన్యుల కష్టాలు తీర్చేందుకు నిరంతరం కృషి చేశామన్న పొంగులేటి
- రైతు సంక్షేమానికి రూ. 1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడి

**హైదరాబాద్ :**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల - మిగతా 2 లో

# నేను చెప్పాల్సినవన్నీ చెప్పా అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా



- 'రాజీనామా'పై కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు
- కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాన్న మంత్రి కొండా సురేఖ
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో భేటీ అయినట్లు వెల్లడి
- తనను ఇంతవరకు రాజీనామా చేయమని చెప్పలేదని వివరణ

**హైదరాబాద్ :**

తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కాంగ్రెస్ పెద్దలను కోరినట్లుగా మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చినట్లు చెప్పారు. తన వ్యవహారంపై పార్టీలో చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదని తెలిపారు. దిల్లీలో - మిగతా 2 లో

# రక్షణ ఎక్స్‌పోకు రండి అనుమతులు ఇప్పించండి

- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సమ్మిట్ కు రాజ్‌నాథ్ ను ఆహ్వానించిన రేవంత్
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 1500 ఎకరాలు సేకరించి ఇస్తామన్న సీఎం
- డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని విన్నపం
- రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై రామ్మోహన్ తో చర్చించిన సీఎం



**హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పోను ప్రారంభించాలని, కావాల్సిన అనుమతులనూ మంజూరు చేయాలని కోరారు. దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి ఇస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ జరుగుతోందన్న సీఎం, మరో 750 ఎకరాలు సేకరించి ఇస్తామని కేంద్రమంత్రికి చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ కేంద్రమంత్రికి తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పోను ప్రారంభించాలని కోరారు. దిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సు నిర్వహిస్తామన్నారు. ఎయిర్‌షో, పారిశ్రామిక, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు ఎక్స్‌పోలో పాల్గొంటారని, ఇలాంటి సదస్సుకు - మిగతా 2 లో

# సంపాదకీయం

## పచ్చి దోపిడీ..!

వెనెజువెలాలో 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు తమ అధీనంలోకి వచ్చే ఒప్పందం కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందంగా దీనిని అభివర్ణించారాయన. ఒక అర్ధరాత్రివేళ అమెరికన్ సైనికబలగాలు విమానాల్లో దిగి, వందలాదిమంది వెనెజువెలా భద్రతాదళాలను కాల్చిచంపి, ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను అపహరించుకుపోయి అమెరికా జైళ్ళలో కుక్కిన ఎనిమిది నెలల్లోనే ట్రంప్ అసలు లక్ష్యం నెరవేరడం మొదలైందన్నమాట. అరవై ఐదు బిలియన్ బ్యారెళ్ళ చమురు నిల్వలున్న ఈ క్షేత్రాల పరిమాణం వెనెజువెలా మొత్తం చమురు క్షేత్రాల్లో ఐదోవంతు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న ఈ దేశంలోని క్షేత్రాలు పూర్తిగా అమెరికా నియంత్రణలోకి పోవడం ఇక ఎంతో దూరంలో లేదని అర్థం. అమెరికా సన్నిహితుడైన వెనెజువెలా వ్యాపారవేత్త అలెజాండ్రో బెటన్‌కోర్ట్ ఈ పదిహేడు క్షేత్రాల నుంచి తైలం తవ్వితీయబోతున్నారని, ఈ దెబ్బతో ఆయన కంపెనీ 'నార్త్ అమెరికన్ బ్లూ ఎనర్జీ పార్ట్‌నర్స్' ఆ దేశంలో రెండవ అతిపెద్ద ప్రైవేటు చమురు కంపెనీగా అవతరిస్తుందని ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక అంటోంది. ఈ భారీ చమురు ఒప్పందంలో పెంటగాన్‌కూ వాటా దక్కబోతున్నదని, దాని 'ఆఫీస్ ఆఫ్ స్ట్రాటజిక్ క్యాపిటల్' (ఓఎస్‌సీ) పెన్నీవారెంట్‌తో అంటే, దాదాపు సున్నా పెట్టుబడితో 35శాతం వాటాని, ఉత్పత్తికి వ్యయానికే ఐదోవంతు చమురునూ కొనుగోలు చేయగలిగే హక్కులను పొందబోతున్నట్టు ఆ పత్రిక విశ్లేషించింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, డోనాల్డ్ ట్రంప్ తన 200వ కార్యనిర్వాహక ఆదేశంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'గా నామకరణం చేసిన అమెరికా రక్షణశాఖ, తాను ఎనిమిది నెలల క్రితం చొరబడిన దేశంలో అతిపెద్ద చమురు క్షేత్రాలకు యజమానిగా అవతరించబోతున్నదని అర్థం.వెనెజువెలాలో అమెరికా వీరవిధేయ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగిజ్ ఈ ఒప్పదం గురించి ఏం చెబుతారో ఊహించడం కష్టం కాదు. వందబిలియన్ డాలర్ల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలతో దేశం కళకళలాడిపోతుందనీ, చమురు ఉత్పత్తి ద్విగుళం బహుళమై ఆర్థికవ్యవస్థ అద్భుతంగా తయారవుతుందన్నారు ఆమె. పూర్తి రహస్యంగా జరిగిన ఈ ఒప్పందం గురించి ట్రంప్ బయటకు చెప్పేవరకూ వెనెజువెలాలో ఎవరికీ తెలియదు. చమురు క్షేత్రాల కేటాయింపుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే రాయల్టీ కూడా, వందేళ్ళక్రితం అమెరికా అనుకూల నియంత గోమేజ్ అమెరికన్ కంపెనీలనుంచి వసూలు చేసినదానికంటే ఎంతో తక్కువట. ఈ ఏడాది ఆరంభంనుంచి అమెరికా తరలించుకుపోయిన చమురుకు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా వెనెజువెలాకు ఇంకా ఇవ్వలేదట. మొన్న జూన్‌లో గత 125 ఏళ్ళలో ఎన్నడూ లేనంత భయంకరమైన భూకంపంతో వెనెజువెలా భారీగా నష్టపోయింది. వందలాదిమంది మరణించారు, నిరాశ్రయులైన వేలాది మంది ఇంకా టెంట్లలోనే జీవిస్తున్నారు. కేవలం రెండునెలల్లో కుదిరిన ఈ ఒప్పందం ఆ దేశాన్ని ఆదుకోవడం కాక, దోచుకోవడం మీద అమెరికాకు ఉన్న శ్రద్ధను తెలియచెబుతోంది. అమెరికా పెట్టిన 'నార్కో టెర్రరిజం' కేసులతో బ్రూక్లిన్ జైల్లో ఉన్న మదురో భూకంపం సమయంలో తన ప్రజలకు సంఘీభావంగా విడుదల చేసిన ఫోటో ఒకటి, ఈ చమురు ఒప్పందం కుదిరిన మర్నాడే వెలుగుచూడటం చక్కగా అతికినట్టు సరిపోయింది.ఇరాన్ యుద్ధంలో చేయి కాల్చుకొని, రేటింగ్ కూడా బాగా పడిపోయిన ట్రంప్ నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరగబోతున్న తరుణంలో, ఈ ఒప్పందాన్ని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇప్పటికే వ్యూహాత్మక చమురునిల్వలు వేగంగా ఖాళీ అవుతూ, కేవలం ఈ ఎనిమిది నెలల కాలంలోనే మూడోవంతు ఖర్చయిన నేపథ్యంలో, వెనెజువెలా చమురు మన ఖాళీపీపాలను నింపుతుందని ట్రంప్ ప్రజలకు హామీ ఇస్తున్నారు. అమెరికన్ రిఫైనరీలకు కారుచవుక వెనెజువెలా చమురు వచ్చి చేరి, ఇంధన ధరలు విపరీతంగా తగ్గి జనానికి మేలు చేకూరుతుందని హామీ ఇస్తున్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్‌మీద పుతిన్ చేస్తున్న యుద్ధానికి ఇంధనం అందిస్తున్నారంటూ భారత్ సహా పలుదేశాల మీద ట్రంప్ వీరంగం వేస్తూ ఆంక్షలూ సుంకాలతో వాటికి ఆర్థికంగా ఊపిరాడకుండా చేస్తున్నారు. తానుమాత్రం వెనెజువెలా చమురుతో ఇరాన్, రష్యాల మీద యుద్ధానికి ఏ అడ్డంకులూ రాకుండా చూసుకుంటున్నారు.


## రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే 'జై కొట్టు' యువజన విభాగం

**మొదటిపేజీ తరువాయి -** సూచించారు. అధినేత ఆదేశాలను జనసైనికులు క్రమశిక్షణతో పాటించాలి అని నాదెండ్ల మనోహర్ తెలిపారు.'జనసేన పార్టీకి బలం యువత, కార్యకర్తలు. మీరు చేసిన కృషి, మీరు మోసిన జెండా, మీరు నిలబడిన తీరు, అంకితభావంతో పవన్ కల్యాణ్ కోసం, జనసేన పార్టీకోసం మనస్ఫూర్తిగా పని చేసిన మీ ఆలోచనే మనల్ని ఇంత దూరం తీసుకొచ్చింది. మీరే జనసేన పార్టీకి వనరులు. మీ ద్వారానే పార్టీ యంత్రాగాన్ని ముందుకు నెట్టుకుంటూ వచ్చాం. ఏ కార్యక్రమం చేసినా మీరే ఉన్నారు. ఎన్ని ఇబ్బందులు, అవరోధాలు ఎదురైనా మీరు పార్టీకోసం, నాయకుడి కోసం నిలబడ్డారు. పవన్ కల్యాణ్ మిమ్మల్ని అర్థం చేసుకున్నారు. ఆయనలోనూ, పార్టీలోనూ ఒకటే ఆలోచన ఉంది. మీ ఆంక్షలు, జనసేనను మీరు ఎలా ఎదగాలనుకున్నారో అది నెరవేర్చడానికే ఈ కార్యక్రమం. ఒక నియంత వైఎస్సార్‌సీపీ పార్టీని ఎదుర్కొని కూటమి కోసం అహర్నిషలు కృషి చేసింది మన జనసేన. ఈ రోజున యువజన విభాగం ఏర్పాటు చేసుకుంటున్నాం. మీలో స్ఫూర్తి నింపడానికే దీనికి 'జై కొట్టు' నామకరణం చేశామన్న జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్.పిఠాపురంలో వేలాది బైకులతో నిర్వహించిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జనసేన జెండాలతో పిఠాపురం కాషాయమయం కాగా 'జై జనసేన', 'జై పవన్ కల్యాణ్' నినాదాలతో పట్టణం మారుమోగింది. ఇదే వేదికగా జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, కళ్యాణం శివ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, తోట సుధీర్, తలాటం సత్య తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ 17వ వర్ధంతి.. ఇడుపులపాయలో జగన్ నివాళి

**మొదటిపేజీ తరువాయి -** వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, 2009 సెప్టెంబర్ 2న 'రచ్చబండ' కార్యక్రమానికి వెళ్తూ నల్లమల అటవీ ప్రాంతంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయన మరణించి 17 ఏళ్లు గడుస్తున్నా, ప్రజలు ఆయన్ను నేటికీ స్మరించుకుంటూనే ఉన్నారు.

## సిక్కింలో 40 ప్రమాదకర సరస్సులు గుర్తింపు



**మొదటిపేజీ తరువాయి -** పొరుగు దేశం నేపాల్‌లో హిమ సరస్సుల ఆకస్మిక ఉప్పెన (గ్లేసియల్ లేక్ ఔట్‌బరస్ట్ ఫ్లడ్) సృష్టించిన పెను విషాదం నేపథ్యంలో సిక్కిం రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్న 40 హిమ సరస్సులను జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం గుర్తించింది. వీటిలో ఏడు సరస్సులను 'అత్యంత ప్రమాదకర' జాబితాలో చేర్చారు. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించి, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించింది.ఈ ప్రమాదకర సరస్సులలో కొన్ని సముద్ర మట్టానికి సుమారు 17,000 అడుగుల ఎత్తులో ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కటి గట్టు తెంచుకున్నా భారీ విపత్తు సంభవించే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ తాంబే మాట్లాడుతూ, కొన్ని సరస్సులపై ఇప్పటికే శాస్త్రీయ అధ్యయనం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సరస్సుల లోతు, నీటి నిల్వ సామర్థ్యం, మంచు కురిసే విధానం, కొండచరియలు విరిగిపడే ముప్పు వంటి అంశాలను నిపుణులు అంచనా వేస్తున్నారని ఆయన వివరించారు.ఆగస్టు 26న నేపాల్‌లో హిమ సరస్సు విచ్ఛిన్నం కావడం వల్ల సంభవించిన వరదల్లో ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 4,000 మంది గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో సిక్కింలో అటువంటి విపత్తు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం పటిష్ఠమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది.

# ఉత్తరాంధ్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం



**మొదటిపేజీ తరువాయి -** కొండలను తొలిచి ఇంజినీరింగ్ అద్భుతంగా రూపుదిద్దుకున్న కాలువ ద్వారా తరలివచ్చిన గోదారి తల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు పాయకరావుపేటలో అఖండ జలహారతితో స్వాగతం పలికారు. గోదారి జల సవ్వడులు ఉత్తరాంధ్ర నేలను ముద్దాడాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి గోదావరి నీళ్లను ఉత్తరాంధ్రకు తరలించే పైలాన్ లాగి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అపురూప క్షణాలను కలకాలం గుర్తుండేలా అందరితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.ఆ తర్వాత నేతలతో కలిసి ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ పోలవరం కాలవ వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ కోలాటంతో పాటు ఉత్తరాంధ్ర సంప్రదాయ నృత్యం తప్పెటగుళ్లను ప్రదర్శించారు. నృత్యాలను తిలకించిన చంద్రబాబు వారిని అభినందించారు. అనంతరం పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీళ్లను తరలించే మ్యాప్‌తోపాటు డయాగ్రమ్‌ను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.తర్వాత కాలువపై ఏర్పాటు చేసిన గేట్ల దగ్గరికి చేరుకున్న చంద్రబాబు రెగ్యులేటర్ ఆన్‌చేసి అనకాపల్లి జిల్లాకు నీటిని విడుదల చేశారు. తర్వాత గోదారమ్మకు సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. గోదావరి తల్లికి సారె సమర్పించారు. నాగహారతి ఇచ్చారు. నీళ్లను నెత్తిన చల్లుకుని పులకించారు. చుట్టూ ఉన్న నేతలతోపాటు ప్రజలపైనా గోదావరి జలాలను చల్లారు. అనంతరం గేట్ల దగ్గరికి చేరుకున్న చంద్రబాబు గోదావరి తల్లికి సాష్టాంగ నమస్కారం చేశారు. తర్వాత మరో గేటు దగ్గర రైతులతో కలిసి రెగ్యులేటర్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. తర్వాత నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.తమ ప్రాంతానికి వచ్చిన గోదారమ్మను చూసిన ప్రజలు పరవశించిపోయారు. ఎన్నో ఏళ్ల సుదీర్ఘ స్వప్నం ఎట్టకేలకు నెరవేరిందంటూ పులకించిపోయారు. తమ ఆకాంక్షను నెరవేర్చిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. గోదారి తల్లికి వినయంగా నమస్కరించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు.

## ఆగ్రాలో ఇద్దరికి ఎబోలా పాజిటివ్

**మొదటిపేజీ తరువాయి -** చేశాం. రోగులు ఇద్దరినీ, వారి కుటుంబాలను హోమ్ ఐసోలేషన్‌కు తరలించాం. అయితే ప్రస్తుతం ఆ ఇద్దరిలో ఆ ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన సాధారణ లక్షణాలు మాత్రమే కనిపించాయి. వారిపై ఎలాంటి తీవ్రమైన ప్రభావం లేదు. కనుక వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అయినప్పటికీ ప్రస్తుతం వైద్య బృందాలు వాళ్లను, వారి కుటుంబ సభ్యులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ఇన్ఫెక్షన్ సోకిన ఏ వ్యక్తి కూడా తమ దృష్టి నుంచి తప్పించుకోకుండా ఉండడానికి అదనపు నమూనాలను సేకరిస్తున్నాం" అని చెప్పారు.

**ఎబోలా లక్షణాలు ఇవే!**

వైద్యుల ప్రకారం, ఎబోలా సోకిన వారికి ప్రారంభ దశలో తీవ్రమైన జ్వరం, చలి, బలహీనత, అలసట, తలనొప్పి, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. ఇన్‌ఫెక్షన్ ముదిరే కొద్దీ రోగుల్లో వాంతులు, విరేచనాలు, తీవ్రమైన కడుపు నొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు రావచ్చు. తీవ్రమైన కేసుల్లో కిడ్నీ, కాలేయం పనితీరు దెబ్బతినవచ్చు. దీనితోపాటు చిగుళ్లు, ముక్కు, కళ్లు, ఇంజెక్షన్ చేసిన ప్రదేశాల నుంచి అంతర్గతంగా, బాహ్యంగా రక్తస్రావం జరగవచ్చు. లేదా వాంతులు, మలంతో రక్తం పడవచ్చు. గందరగోళం, చిరాకు, తీవ్రమైన అశాంతి వంటి నరాల సంబంధిత లక్షణాలు కూడా ఉండవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఎబోలా వ్యాప్తిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించినప్పటి నుంచి భారతదేశం సరిహద్దుల్లో కఠినమైన నిబంధనలను అమలు చేస్తోంది.

## భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి

**మొదటిపేజీ తరువాయి -** సంభవించిన ఆకస్మిక వరదల వల్ల ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గల్లంతయ్యారు. ఈ తీవ్ర విపత్తు వాతావరణ మార్పుల వల్ల హిమనీనదాలు (గ్లేసియర్లు) విరుచుకుపడటం వల్లే సంభవించిందని శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులకు తమ దేశం కారణం కాకపోయినా, అతిపెద్ద పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము తీవ్ర మూల్యం చెల్లించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తమకు ఇచ్చే సాయం లేదా భిక్ష కాదని, బాధితులకు చెల్లించాల్సిన చట్టపరమైన, నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు.తమ దౌత్య విధానాన్ని 'సాయం కోరడం' నుంచి 'న్యాయం, నష్టపరిహారం పొందే' దిశగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంశాన్ని ఐక్యరాజ్యసమితి గ్లోబల్ లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు... రానున్న ఐరాస సర్వసభ్య సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తనున్నట్లు సమాచారం. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు, పునర్నిర్మాణానికి ప్రాథమికంగా 4 నుంచి 5 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు.

## తమిళనాడు ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం




**మొదటిపేజీ తరువాయి -** శాఖ పరిధిలోని 52 ముఖ్యమైన ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆలయాల్లో పవిత్రతను కాపాడటం, ప్రశాంతమైన వాతావరణాన్ని కొనసాగించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ నిబంధనల ప్రకారం, భక్తులు ఆలయంలోకి ప్రవేశించే ముందు తమ స్మార్ట్‌ఫోన్‌లను తప్పనిసరిగా ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో డిపాజిట్ చేయాలి. ఇందుకు రుసుముగా ప్రతి ఫోన్‌కు రూ.5 వసూలు చేస్తారు. ఫోన్ డిపాజిట్ చేశాక, దాన్ని తిరిగి తీసుకునేందుకు భక్తులకు ఒక టోకెన్ లేదా రశీదు ఇస్తారు. కొన్ని ఆలయాల్లో భక్తుడి ఫోటో, ఫోన్ మోడల్ వంటి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అయితే, కెమెరా సౌకర్యం లేని సాధారణ మొబైల్ ఫోన్లను లోపలికి తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది.ఆలయాల్లో ఫోటోలు, వీడియోలు, సెల్ఫీలు, సోషల్ మీడియా రీల్స్ తీయడం వంటివి పెరిగిపోవడంతో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర ఆలయం, కంచిలోని దేవరాజస్వామి ఆలయం, శ్రీరంగం వంటి ప్రముఖ క్షేత్రాల్లో ఇప్పటికే ఫోన్ డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. భక్తుల ఫోన్ల భద్రతకు లాకర్లు, సిబ్బంది, సీసీటీవీ నిఘా వంటి అన్ని ఏర్పాట్లు చేశామని హెచ్‌ఆర్‌సీఈ మంత్రి రమేశ్ తెలిపారు.ప్రభుత్వ నిర్ణయంపై భక్తుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆలయాల్లో ఏకాగ్రతకు, భక్తికి ఇది దోహదపడుతుందని చాలామంది స్వాగతిస్తుండగా, కౌంటర్ల వద్ద క్యూ లైన్లు, ఫోన్ల భద్రతపై కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఇబ్బంది కలుగుతుందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. కాగా, పళని, మధురై, తిరుచెందూర్ వంటి కొన్ని ఆలయాల్లో ఈ నిబంధన ముందు నుంచే అమల్లో ఉంది. ఇప్పుడు దాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ఆలయాలకు విస్తరించారు.

# రక్షణ ఎక్స్‌పోకు రండి - అనుమతులు ఇప్పించండి



**మొదటిపేజీ తరువాయి -** రక్షణమంత్రి హాజరై వారికి మార్గనిర్దేశం చేస్తే ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు.రక్షణ ఎక్స్‌పో-2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు సహకరించాలని రాజ్‌నాథ్‌సింగ్‌కు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వాలన్నారు. భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యులు కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు.ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూ సేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్‌రెడ్డి వివరించారు. రక్షణ శాఖ 1500 ఎకరాలు కోరినందున మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్) ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందన్నారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం ఒక్క రూపాయి నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని సీఎం చెప్పారు.

# నేను చెప్పాల్సినవన్నీ చెప్పా, అధిష్టానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా




**మొదటిపేజీ తరువాయి -** మీడియాతో మాట్లాడిన కొండా సురేఖ ఈ వ్యాఖ్యలు చేశారు. తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని అధిష్ఠానానికి చెప్పినట్లు వివరించారు. సుస్మితకు వివాహం అయిందని, ఆమె ఇండిపెండెంట్‌గా ఉందన్నారు.కాంగ్రెస్ హైకమాండ్‌కు తాను చెప్పాల్సినదంతా చెప్పానని మంత్రి కొండా సురేఖ వివరించారు. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారన్నారు. తన బిడ్డ స్వతంత్రంగా ఉందని వివరించారు. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నానన్నారు. ఆమె జీవితం ఆమె ఇష్టమని సురేఖ పేర్కొన్నారు. తనతో పాటు తన భర్త రాజకీయ జీవితం మా ఇష్టం అని తెలిపారు. తాను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నానని కొండా సురేఖ చెప్పారు. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నానని వివరించారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నానని తెలిపారు. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరానని ఆమె వివరించారు."కాంగ్రెస్ అధిష్ఠానానికి నేను చెప్పుకోవాల్సిందంతా చెప్పాను. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారు. నా బిడ్డ స్వతంత్రంగా ఉంది. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నాను. ఆమె జీవితం ఆమె ఇష్టం. నాతో పాటు నా భర్త రాజకీయ జీవితం మా ఇష్టం. నేను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నాను. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నా. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నాను. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరాను.తన కుమార్తె వ్యాఖ్యలపై తాను స్పందించనని కొండా సురేఖ తెలిపారు. సుస్మిత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదన్నారు. రోజూ ఎంతో మంది మాట్లాడతారని అందులో సుస్మిత కూడా ఒకరని కొండా సురేఖ అన్నారు. తన బిడ్డ కనుక తనను బాధ్యురాలిని చేయడం సరికాదని ఆమె వివరించారు. ఆమె వ్యాఖ్యలను ఖండించడం, సమర్థించడం చేయనన్నారు. తన వివరణను మీనాక్షి నటరాజన్‌కు చెప్పానట్లు వెల్లడించారు. అధిష్ఠానానికి ఆమె చెప్తానన్నారని సురేఖ వివరించారు.పార్టీలో కొంతమందితో తనపై ఆరోపణలు చేయించారన్నారు. ఎవరు అలా చేయించారో తనకు తెలుసని కొండా సురేఖ పేర్కొన్నారు. పేర్లు చెబితే వివాదం అవుతుందన్నారు. తనపై ఆరోపణలు చేసిన వారికీ షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని సురేఖ అభిప్రాయపడ్డారు. పార్టీ ఆ దిశగానూ ఆలోచించాలని ఆమె కోరారు. తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే అసలు తప్పు అని అన్నారు. ఏఐసీసీ సభ్యురాలిగా ఉన్నానని అందుకే ఇక్కడికి వచ్చి తన బాధ చెప్పుకొన్నానన్నారు. రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా వివరణ ఇచ్చామన్న ఆమె, పార్టీ తీసుకునే నిర్ణయం ఆధారంగా తన ఆలోచన ఉంటుందని కొండా సురేఖ అన్నారు."నేను చెప్పాల్సినవన్నీ పార్టీ పెద్దలకు చెప్పాను. నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు. నా వివరణ అంతా కేసీ వేణుగోపాల్‌కు వాట్సప్ చేశాను. పార్టీ ఏం నిర్ణయం తీసుకుంటుందనేది నాకు తెలియదు. నా కుమార్తె వ్యాఖ్యల గురించి ఏమీ మాట్లాడను. సుస్మిత వ్యాఖ్యలను ఖండించటం, సమర్థించటం చేయను. ఇండిపెండెంట్ మహిళ మాట్లాడవద్దని చెప్పే హక్కు నాకు లేదు. నా కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయటం సరికాదన్న మంత్రి కొండా సురేఖ.ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను కాంగ్రెస్ హైకమాండ్‌కు టీపీసీసీ పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి దిల్లీకి వెళ్లారు. కొండా సురేఖ విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.మంత్రి కొండా సురేఖను పదవి నుంచి తొలగించాలని ఏఐసీసీకీ పీసీసీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ పూర్తి స్థాయి రిపోర్టును పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు అందించింది. పార్టీ గీతను దాటి వ్యవహరించిన నేతలపై చర్యలు తీసుకోవాలని నివేదికలో పేర్కొన్నట్లు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కొద్దిరోజుల క్రితం వివరించారు. ఈ నివేదికపైనే ఏఐసీసీ పెద్దలు ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్, ఇతర కీలక నేతలతో చర్చించింది.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం

**మొదటిపేజీ తరువాయి -** కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు.కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని




సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.

# వెల్దుర్తిలో పోలీసు విధులకు ఆటంకం.. దురుసు ప్రవర్తనకు రిమాండ్‌తో సమాధానం!

ఖాకీ కాలర్ పట్టుకున్నాడు.. కటకటాల వెనక్కి వెళ్లాడు!

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన యువకుడి

అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన

చర్యలు తప్పవు.. వెల్దుర్తి పోలీసుల స్ట్రాంగ్ వార్నింగ్!

**వెల్దుర్తి, సెప్టెంబర్ 02, (సీమకిరణం న్యూస్):** విధులు నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించి, షర్టు కాలర్ పట్టుకుని బెదిరింపులకు పాల్పడి పోలీసు విధులకు ఆటంకం కలిగించిన యువకుడిని వెల్దుర్తి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో వెల్దుర్తి జడ్పీ హైస్కూల్ బాయ్స్ ప్రాంగణంలో శ్రీనివాస్ గౌడ్ అక్రమంగా స్థలాన్ని ఆక్రమించుకుని అందులో లెట్రిన్ గుంతలు త్రవ్వినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు గుంతలను పూడ్చి వేసేందుకు జడ్పీ హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఈ నెల 12వ తేదీన పోలీసు రక్షణ కల్పించాలని వెల్దుర్తి పోలీసులను కోరారు. హెడ్‌మాస్టర్ అభ్యర్థన మేరకు వెల్దుర్తి పోలీస్ స్టేషన్ నుంచి కానిస్టేబుల్ రాంబాబు, హోంగార్డు వెంకట్ రాముడు అక్కడ విధులు నిర్వహిస్తూ గుంతలు పూడ్చే కార్యక్రమానికి పోలీసు రక్షణ కల్పించారు. ఈ క్రమంలో శ్రీనివాస్ గౌడ్ కుమారుడు భరత్ గౌడ్ అక్కడికి వచ్చి విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాంబాబుపై దురుసుగా ప్రవర్తించినట్లు పోలీసులు తెలిపారు. కానిస్టేబుల్ షర్టు కాలర్ పట్టుకుని, ఉద్యోగం పీకిస్తానంటూ బెదిరించి పోలీసు విధులకు ఆటంకం కలిగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కానిస్టేబుల్ రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెల్దుర్తి సీఐ యుగంధర్ పర్యవేక్షణలో, ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించి నిందితుడు భరత్ గౌడ్ (24), (తండ్రి పేరు : శ్రీనివాస్ గౌడ్) భరత్ గౌడ్ ను అతని ఇంటి వద్ద అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.



**చట్టానికి ఎవరూ అతీతులు కారు..**

ఈ సందర్భంగా వెల్దుర్తి సీఐ యుగంధర్, ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ పోలీసు విధులకు ఎవరైనా ఆటంకం కలిగించినా, పోలీసు సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించినా, అలాగే ఇతర ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నా చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులతో చట్టబద్ధమైన పద్ధతిలో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని, విధులకు ఆటంకం కలిగించడం, బెదిరింపులకు పాల్పడడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

# కర్నూలులోనే ఏపీ హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

సీనియర్ న్యాయవాది వై. జయరాజు

హామీని వెంటనే నెరవేర్చాలని మహిళా

న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష







కర్నూలు జిల్లా కోర్టు ఆవరణలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం రిలే నిరాహార దీక్ష చేస్తున్న మహిళా న్యాయవాదులను పూలతో అభినందిస్తున్న సీనియర్ న్యాయవాది వై. జయరాజు

**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 02, (సీమకిరణం న్యూస్) :** రాయలసీమ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కర్నూలు జిల్లా కోర్టు ఆవరణలో మహిళా న్యాయవాదులు బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో 50 మందికి పైగా మహిళా న్యాయవాదులు పాల్గొని కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలంటూ తమ గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా కర్నూలు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీనియర్ న్యాయవాది వై. జయరాజు దీక్షా శిబిరాన్ని సందర్శించి మహిళా న్యాయవాదులకు పూలు అందజేసి అభినందించారు. రాయలసీమ ప్రాంతానికి గత ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు పదేపదే చేసిన అన్యాయాన్ని ఆయన ప్రస్తావించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియపై వివరిస్తూ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధికారిక సమ్మతితో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేసే అధికారం కలిగి ఉందని వై. జయరాజు స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న నేపథ్యంలో కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్ ఏర్పాటును మరింత ఆలస్యం చేయడంలో ఎటువంటి సమర్థనీయత లేదని ఆయన అన్నారు. రాయలసీమ ప్రాంతానికి న్యాయం చేయాలంటే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ (ఖణదీూ) అధ్యక్షుడు బి. చంద్రుడు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సీనియర్ న్యాయవాది వి. నాగలక్ష్మీదేవి కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. మహిళా న్యాయవాదుల పోరాటానికి న్యాయవాద సంఘాలు, రాయలసీమ ప్రజలు మద్దతు పలుకుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు పొడిగింపు

సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తులకు అవకాశం

కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు వెల్లడి

**కల్లూరు, సెప్టెంబర్ 02, (సీమకిరణం న్యూస్):** 138-పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ -2026 ప్రక్రియకు భారత ఎన్నికల సంఘం గడువును పొడిగించినట్లు కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. 01-07-2026 అర్హత తేదీ ఆధారంగా ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పాణ్యం నియోజకవర్గ పరిధిలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలోని తప్పులు, మార్పులు, చేర్పులను నిర్ణీత గడువులోగా సరిచేసుకోవాలని ఆయన సూచించారు.

ముఖ్యమైన తేదీలు ఇవే..కార్యక్రమం గడువు,

1) అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణ
31-07-2026 నుండి 10-09-2026 వరకు.
2) అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారం
31-07-2026 నుండి 05-10-2026 వరకు.
3)తుది ఓటరు జాబితా ప్రచురణ
09-10-2026.

పేర్లు లేనివారు వెంటనే నమోదు చేసుకోవాలి.

ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని వారు, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. ఓటరు వివరాల్లో పేరు, వయస్సు, చిరునామా తదితర అంశాల్లో తప్పులు ఉన్నట్లయితే సవరణ చేసుకునేందుకు కూడా అవకాశం ఉందన్నారు. చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్థానిక బి ఎల్ ఓ, ఏ ఈ ఆర్ ఓ, లేదా ఈ ఆర్ ఓ కార్యాలయాలను సంప్రదించి సెప్టెంబర్ 10వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

**అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి**



18 సంవత్సరాలు నిండిన అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవడం తమ బాధ్యతగా భావించాలని తహసీల్దార్ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకమని, ఈ అవకాశాన్ని ఎవరూ వదులుకోవద్దని పేర్కొన్నారు. సెప్టెంబర్ 10 వరకు పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు.

# వర్షాకాలం దృష్ట్యా మెరుగైన పారిశుధ్య పనులను నిర్వహించండి

-నెల్లూరు నగర కమీషనర్ వైఓ నందన్

**నెల్లూరు,సెప్టెంబర్ 2 (సీమకిరణం న్యూస్)::** వారాంతపు సమీక్ష సమావేశంలో భాగంగా శానిటేషన్ విభాగంతో నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం సమీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమీషనర్ మాట్లాడుతూ ఇప్పటివరకు అను సంధానం చేయని,ట్రేడ్ లైసెన్స్ లను వార్డుల వారీగా అనుసంధానించే కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని సిబ్బందినీ ఆదేశించారు.డ్రైను కాలువలలో పూడికతీత పనులను ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో చేపట్టాలని సూచించారు.ప్రతిరోజు వారి వారి వార్డులకు సంబంధించిన వర్కర్ల అటెండెన్స్ ను ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సిబ్బంది అందరూ కచ్చితంగా యూనిఫామ్ ధరించి విధులకు హాజరు అయ్యేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు.సచివాలయ కార్యదర్శులు





అందరూ వారికి కేటాయించిన పరిధిలో పని వేళ యందు అధికారులకు అందుబాటులో ఉండాలని ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దినేష్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని స్ప్రేయింగ్, ఫాగింగ్ చర్యలను ప్రతిరోజు నిర్వహించేలాగా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఉద్దేశించి కమిషనర్ ఆదేశించారు.నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, కాలువలలో స్ప్రేయింగ్, ఫాగింగ్ చర్యలను చేపట్టాలని,డ్రైను కాలువలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టాలని సిబ్బందిని ఉద్దేశించి ఆదేశించారు.నగరవ్యాప్తంగా ఉన్నగార్బేజ్ వలరనబుల్ పాయింట్స్/బ్లాక్ స్పాట్ ను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను చేపట్టి పరిశుభ్రంగా ప్రాంతాలను తీర్చిదిద్ది వ్యర్థాలను తిరిగి వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దినేష్, మలేరియా విభాగం డాక్టర్ జిజియా,వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్మోహన్, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేమిరెడ్డి క్రేజ్ చూసి.. జగన్‌లో దడ.. అందుకే అనిల్‌తో బురదజల్లుడు రాజకీయం

-తెలుగుదేశం పార్టీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి

**నెల్లూరు,సెప్టెంబర్ 2,(సీమ కిరణం న్యూస్)::** నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతుల ప్రజాదరణను చూసి.. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భయపడుతున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇటీవల విలేకరుల సమావేశాల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిపై మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.బుధవారం నెల్లూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వినోద్ మాట్లాడారు.వేమిరెడ్డి దంపతుల ప్రజాసేవ వల్ల తెలుగుదేశం పార్టీ ప్రజల్లోకి బలంగా వెళ్తోందన్నారు.గత ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎంపీగా పోటీ చేసి 2.50 లక్షల పైచిలుకు భారీ మెజారిటీ సాధించడంతో నెల్లూరు జిల్లాలో ఎన్డీయే కూటమి 10కి 10





నియోజకవర్గాలు గెలుచుకుందని గుర్తు చేశారు. ఇటీవల వైసీపీ నిర్వహించిన అంతర్గత సర్వేల్లో కూడా జిల్లాలో మళ్లీ కూటమి ప్రభంజనమే రిపీట్ అవుతుందని, వేమిరెడ్డి భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని తేలడంతో జగన్‌మోహన్ రెడ్డికి వణుకు మొదలైందన్నారు.ఈ సమయంలో రాజకీయంగా ఖాళీగా ఉన్న అనిల్ కుమార్ యాదవ్,క్వార్జ్ మైనింగ్‌పై పాత డేటాను పట్టుకుని జగన్ దగ్గరకు వెళ్లగా,అదేదో నిజమని నమ్మి విలేకరుల సమావేశాలు పెట్టమని జగనే పంపారని తెలిపారు. దీంతో అనిల్ పాత చింతకాయ పచ్చడినే మళ్లీ మళ్లీ రుబ్బుతూ తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.గతంలో మంత్రిగా అనిల్ కుమార్ యాదవ్ చేసిన అపారమైన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి నిజాలు బయటపెట్టాలని కూటమి ప్రభుత్వాన్ని,జిల్లా మంత్రులను,ఎంపీని కోరుతున్నట్లు తెలిపారు. అయితే అనిల్‌ను మాత్రం అరెస్టు చేసి జైల్లో పెట్టవద్దని ఎద్దేవా చేశారు. వైసీపీలో జైలుకెళ్లిన వారికే ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తారని ఆశతో అనిల్ 'నన్ను జైల్లో పెట్టండి' అని నాటకాలాడుతున్నారని ఎద్దేవా చేశారు.కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తీరును కూడా తీవ్రంగా తప్పుపట్టారు.వేమిరెడ్డి తరఫున మాట్లాడే వారిని విమర్శిస్తున్న ప్రసన్న, అసలు అనిల్ వెనుక ఉండి ఎందుకు వత్తాసు పలుకుతున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు.ప్రసన్న,అనిల్ ఇద్దరికీ జిల్లాలో టిక్కెట్లు లేవని,ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# నిరుపేదల ఆశాజ్యోతి వైఎస్ రాజశేఖర్ రెడ్డి





**డోన్ టౌన్, సెప్టెంబర్ 02,(సీమ కిరణం న్యూస్):** డోన్ లో దివంగత నేత మన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.యస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులందరూ పాల్గొని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు.అనంతరం వైయస్సార్ సర్కిల్ చేరుకొని అక్కడున్న డాక్టర్. వై.యస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల సంక్షేమ కోసం వైయస్సార్ చేసిన సేవలను ఈ సందర్భముగా నాయకులు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రాజ్ కుమార్ , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్,ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి ,నంద్యాల జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్ , పట్టణ అధ్యక్షుడు మల్లికార్జు రెడ్డి , వైస్ ఎంపీపీ యెర్రిస్వామి ,డోన్ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్ ,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామచంద్రుడు , దినేష్ గౌడ్ , చంద్రశేఖర్, ఫారెస్ట్ మౌలాలి, మాజీ కౌన్సిలర్ కౌన్సిలర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం



మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన

ఎస్సై నాగార్జున

**ప్యాపిలి, సెప్టెంబర్ 2 (సీమ కిరణం న్యూస్):** పట్టణంలోని కస్తూరిబాయి జూనియర్ కళాశాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మహిళల భద్రత, మాదకద్రవ్యాల వ్యతిరేకత సైబర్ నేరాలు తదితర భద్రతా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగార్జున మాట్లాడుతూ. విద్యార్థినులకు వ్యక్తిగత భద్రత, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడం, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, విద్యార్థినుల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ఎస్సై నాగార్జున తెలిపారు. ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ







**డోన్ టౌన్, సెప్టెంబర్ 02,(సీమ కిరణం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా డోన్ పట్టణంలో జనసేన పార్టీ నాయకులు ఆల మోహన్ రెడ్డి, మైఖేల్ ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, పేదలకు స్వెటర్ లు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డోన్ నియోజకవర్గ ప్రజల తరపున కూటమి నాయకులు కార్యకర్తలు పవన్ కళ్యాణ్ అభిమానులు తరపున నా తరపున డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేసినట్లు ఆయన ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండేలా చూడాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధం కేక్ కట్ చేసి అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను, పేదలకు స్వేటర్లు పంపిణీ మరియు అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు మరియు పవన్ కళ్యాణ్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్యాపిలిలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**ప్యాపిలి, సెప్టెంబర్ 2 (సీమ కిరణం న్యూస్):** ప్యాపిలి పట్టణంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రజలకు కేక్, అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు క్రిష్టిపాడు చంద్ర, సునీల్, జనసేన నాయకుడు మధునాయుడు, టీడీపీ నాయకులు కొంగనపల్లి మధు, గండికోట రమేష్, వెంకటేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో నలుగురికి జైలు శిక్ష

**డోన్ టౌన్, సెప్టెంబర్ 02,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలో పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్ . నూరుల్లా నలుగురికి జైలు శిక్ష విధించినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్ భాష, తెలిపారు.



స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో నమోదైన డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసులో కొండపేట, డోన్ టౌన్, చాకలి తిరుమలేష్, అనే వ్యక్తికి నాలుగురోజులు జైలు శిక్ష. కోట్ల విజయభాస్కర్ రెడ్డి నగర్, డోన్ టౌన్ ,కె. నీలకంట అనే వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష, తాడూరు గ్రామం, డోను మండలం , చక్రాల అబ్దుల్ కరీం అనే వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష. కొండపేట, డోన్ టౌన్ ఈడిగ వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల డ్రైవర్ ప్రాణాలతో పాటు అమాయక ప్రజల ప్రాణాలు కూడ ప్రమాదంలోకి పడతాయని, ఎవరు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి, కోర్టు ముందు హాజరుపరుస్తామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడపడం వలన భారీ జరిమానాలు, జైలు శిక్ష తప్పవని హెచ్చరించారు.. రోడ్డు ప్రమాదాలు పెరగకుండా ఉండాలంటే ప్రజలందరూ చట్టాన్ని కచ్చితంగా పాటించాలి. ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపితే వారి పై డోన్ అర్బన్ పోలీస్ స్టేషన్ కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి వెనుకడుగు వేయరు. ప్రజలందరూ తమ ప్రాణాల రక్షణ కోసం, ఇతరుల ప్రాణాల రక్షణ కోసం మద్యం సేవించి వాహనాలు నడపరాదని డోన్ అర్బన్ పోలీస్ స్టేషన్ వారు హెచ్చరించారు.

# పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా బారాషాహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు.....



**నెల్లూరు సిటీ సెప్టెంబర్ 2 (సీమ కిరణం న్యూస్):** నెల్లూరు నగరంలోని ప్రముఖ ప్రఖ్యాత దర్గా బారాషాహీద్ లో బుధవారం జనసేన వ్యవస్థాపక అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నెల్లూరుకు చెందిన పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు ఏఎస్ పేట (రహమతాబాద్) లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ స్వాముల వారి దర్గా వంశస్థుడు ఎస్ జి ఎన్ ఫయాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పవన్ కళ్యాణ్ కోసం ప్రత్యేక దువా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధిలో కూటమి పాలనలో పవన్ కళ్యాణ్ పాత్ర కీలకమని ఈ సందర్భంగా వారు కొని ఆడారు........



## శక్తి యాప్ పై మహిళలకు అవగాహన



**డోన్ టౌన్, సెప్టెంబర్ 02,(సీమ కిరణం న్యూస్):** నంద్యాల జిల్లా ఎస్పీ డిఎస్పీల ఆదేశాల మేరకు డోన్ శక్తి టీం పట్టణ సీఐ ఇంతియాజ్ భాష ఆధ్వర్యంలో శ్రీనివాస్ నగర్, దగ్గర మహిళలకు శక్తి యాప్ గురించి వివరిస్తూ ప్రస్తుతం మహిళల పై సమాజంలో జరిగే అత్యాచారాలు, మహిళల పట్ల ఇతరుల దురుసు ప్రవర్తన ల గురించి వెంటనే క్రింది నంబర్లకు 112 లేదా 100 కు ఫోన్ చేసి తెలపవచ్చునని, బాల్యవివాహాలు చేస్తున్నట్లుగా తెలిసినా 1098కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఏపీకే ఫైల్స్ మరియు ఫేక్ మెసేజ్లు వంటి సైబర్ నేరాలకు 1930 నెంబర్ కు సమాచారం ఇవ్వవలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది , మరియు శక్తి టీం మహిళ పోలీసులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల పరిశీలన





**డోన్ టౌన్, సెప్టెంబర్ 02,(సీమ కిరణం న్యూస్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా డోన్ పట్టణంలోని పోలింగ్ బూత్‌లను మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మరియు టౌన్ సర్వేయర్ లు వారి సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

## ఘనంగా పందిటి సుబ్బయ్య జన్మదిన వేడుకలు



**నెల్లూరు,ఆగస్టు 2, (సీమకిరణం న్యూస్):** సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పందిటి సుబ్బయ్య జన్మదినం సందర్భంగా నెల్లూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న బాబు జగజీవన్ రాం భవనంలో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు సంఘాల దళిత నాయకులు,అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని.. కేకులు కట్ చేసి,భారీ గజమాల,పూల మాలలు, శాలవాలతో ఘనంగా సత్కరించి.. పుష్ప గుచ్చాలు అందజేసి పందిటి సుబ్బయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.పందిటి సుబ్బయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియడానికి విచ్చేసిన అభిమానులతో బాబు జగజీవన్ రాం భవనం కిటకిటలాడింది.రాబోయే రోజుల్లో ఇటువంటి జన్మదిన వేడుకలు పందిటి సుబ్బయ్య మరెన్నో జరుపుకోవాలని దళిత సంఘాల నాయకులు, అభిమానులు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పందిటి సుబ్బయ్య మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి విచ్చేసి.. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.తనపై చూపించిన అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోను అని, తన ఊపిరి ఉన్నంతవరకు దళితులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటూ.. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, మహిళా నాయకులు, అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు నిర్వహించాలి



డోన్ టౌన్, సెప్టెంబర్ 02,(సీమ కిరణం న్యూస్): డోన్ పట్టణంలో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, అధికారుల నిబంధనలను పాటిస్తూ ప్రశాంతంగా నిర్వహించాలని డోన్ డీఎస్పీ పి. శ్రీనివాసులు, ఆర్డీవో నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ కసిరెడ్డి నరేష్ రెడ్డి, మరియు శ్రీ గణేష్ మహోత్సవ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గణేష్ మండపాల నిర్వాహకులు నిరంతరం (24 గంటలు) విగ్రహం మరియు మండపం వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. వేడుకల్లో డీజేలను పూర్తిగా నిషేధించామని, అశ్లీల పాటలకు స్వస్తి పలికి కేవలం సాంప్రదాయ నృత్యాలతోనే నిమజ్జన వేడుకలు నిర్వహించాలని సూచించారు. నిమజ్జన వాహనాల ట్రాక్టర్ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని హెచ్చరించారు. విగ్రహాల ఎత్తు 13 అడుగుల లోపు మాత్రమే ఉండాలి. రైల్వే ఎలక్ట్రిక్ లైన్ దృష్టిలో ఉంచుకుని కొండపేట, చిగురాంపేట, పాతపేట రైల్వే గేట్ల మార్గాల గుండా భారీ విగ్రహాలకు అనుమతి లేదు. నిర్వాహకులు అటువంటి పెద్ద విగ్రహాలను ఫ్లైఓవర్ బ్రిడ్జి పైనుంచే నిమజ్జనానికి తీసుకువెళ్లాలి. గత ఏడాది నిమజ్జన సమయంలో పౌడర్ చల్లుకోవడం వల్ల సుమారు 70 మందికి కంటి సమస్యలు వచ్చాయి. కాబట్టి ఈసారి అలాంటి పనులకు దూరంగా ఉండాలి. నిమజ్జనం సమయంలో రద్దీని నివారించేందుకు, ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఒకేసారి 3 క్రేన్లను ఉపయోగించి నిమజ్జనం పూర్తి చేయాలని ఉత్సవ కమిటీ స్పష్టం చేసింది. పట్టణ ప్రజలు, భక్తులు, మరియు మండపాల నిర్వాహకులు అందరూ అధికారులకు సహకరించి, పండుగను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్ భాష, ఎమ్మార్వో రవికుమార్, నాగమణి, ఫైర్ సిబ్బంది, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్, మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమం

### గౌచర్స్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి జనసేన నేత బాజ్జి ఆర్థిక సాయం






**వెల్దుర్తి సెప్టెంబర్ 02(సీమ కిరణం న్యూస్ ):** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షుడు బాజ్జి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మానవత్వాన్ని చాటుకుంటూ కర్నూలు జిల్లా ఎన్టీఆర్ బిల్డింగ్‌లో నివాసం ఉంటూ చిన్నారికి గౌచర్స్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి జనసేన మండల అధ్యక్షుడు బాజ్జి రూ.8,000 ఆర్థిక సహాయం అందించారు. చిన్నారి వైద్య ఖర్చులకు తన వంతు సహకారంగా ఈ మొత్తాన్ని అందించినట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సంతోషంగా ఉందని బాజ్జి పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఇద్దరికీ జరిమానా




**డోన్ టౌన్, సెప్టెంబర్ 02 (సీమ కిరణం న్యూస్):** డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్ . నూరుల్లా ఇద్దరికీ జరిమానా విధించినట్లు రూరల్ సీఐ రాకేష్, ఎస్సై మమత తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో నమోదైన డ్రంకన్ అండ్ డ్రైవ్ ప్రసాద్ డోన్ టౌన్, అనే వ్యక్తికి పది వేలు జరిమానా. మహేష్ , అలంకొండ గ్రామం, క్రిష్ణగిరి మండలం, అనే వ్యక్తికి పదివేలు జరిమానా. మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల డ్రైవర్ ప్రాణాలతో పాటు అమాయక ప్రజల ప్రాణాలు కూడ ప్రమాదంలోకి పడతాయని, ఎవరు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి, కోర్టు ముందు హాజరుపరుస్తామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడపడం వలన భారీ జరిమానాలు, జైలు శిక్ష తప్పవని హెచ్చరించారు.. రోడ్డు ప్రమాదాలు పెరగకుండా ఉండాలంటే ప్రజలందరూ చట్టాన్ని కచ్చితంగా పాటించాలి. ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపితే వారి పై డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి వెనుకడుగు వేయరు. ప్రజలందరూ తమ ప్రాణాల రక్షణ కోసం, ఇతరుల ప్రాణాల రక్షణ కోసం మద్యం సేవించి వాహనాలు నడపరాదని డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ వారు హెచ్చరించారు.

## ఎన్.ఎస్.యు.ఐ ఆధ్వర్యంలో ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి



**డోన్ టౌన్, సెప్టెంబర్ 02,(సీమ కిరణం న్యూస్):** జనం గుండెల్లో చెరగని ముద్ర వేసిన మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని డోన్ పట్టణంలో యువజన కాంగ్రెస్, (ఎన్.ఎస్.యు.ఐ) ఆధ్వర్యంలో గురువారం మానవతా దృక్పథంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పట్టణంలోని సమైక్యాంధ్ర కట్ట (పాత బస్టాండ్) ప్రాంగణంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తెలుగు విజయ్ కుమార్, ఎన్.ఎస్.యు.ఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నిరంజన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోన్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంతియాజ్ బాషా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడటంలో రక్తదానం అత్యంత కీలకమైన, పవిత్రమైన పాత్ర పోషిస్తుంది. "ఒక్క చుక్క రక్తం... ఒక పసి ప్రాణానికి పునర్జన్మ" అని అన్నారు. రక్తాన్ని దానం చేసిన యువకులకు ఆయన చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు అదిల్, రఫీ, ఎన్.ఎస్.యు.ఐ నాయకులు మధు, దాదాతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు పాల్గొని రక్తదానం చేశారు.

## రొయ్యలు వీరికి యమ డేంజర్ తింటే ప్రాణాలకే రిస్క్ ఈ విషయాలు తప్పక తెలుసుకోండి









ఆదివారం వచ్చిందంటే చాలు.. ముక్క లేనిదే ముద్ద దిగదు. మరీ ముఖ్యంగా సీఫుడ్ ప్రియులకు రొయ్యల వేపుడు లేదా రొయ్యల కూర కనిపిస్తే ఆ గుమగుమలకు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. ప్రోటీన్లు, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉండే రొయ్యలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే అందరికీ రొయ్యలు అమృతం కావు. కొన్ని రకాల వ్యాధులు ఉన్నవారు రొయ్యలను తింటే, అది శరీరంలో విషంగా మారి ప్రాణాంతక సమస్యలకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కీళ్ల నొప్పులు - యూరిక్ యాసిడ్: కీళ్ల నొప్పులతో బాధపడేవారు రొయ్యలకు దూరంగా ఉండటమే శ్రేయస్కరం. రొయ్యలలో ప్యూరిన్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో జీర్ణమైనప్పుడు యూరిక్ యాసిడ్‌గా మారుతాయి. రక్తంలో యూరిక్ యాసిడ్ పెరిగితే అది కీళ్ల మధ్య స్ఫటికాలుగా పేరుకుపోయి తీవ్రమైన నొప్పిని, వాపును కలిగిస్తుంది. దీన్నే గౌట్ అంటారు. రొయ్యలు తిన్న మరుసటి రోజే కీళ్ల నొప్పులు ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. కీళ్ల నొప్పులు - యూరిక్ యాసిడ్: కీళ్ల నొప్పులతో బాధపడేవారు రొయ్యలకు దూరంగా ఉండటమే శ్రేయస్కరం. రొయ్యలలో ప్యూరిన్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో జీర్ణమైనప్పుడు యూరిక్ యాసిడ్‌గా మారుతాయి. రక్తంలో యూరిక్ యాసిడ్ పెరిగితే అది కీళ్ల మధ్య స్ఫటికాలుగా పేరుకుపోయి తీవ్రమైన నొప్పిని, వాపును కలిగిస్తుంది. దీన్నే గౌట్ అంటారు. రొయ్యలు తిన్న మరుసటి రోజే కీళ్ల నొప్పులు ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. కిడ్నీ వ్యాధులు - థైరాయిడ్ హెచ్చుతగ్గులు: రొయ్యలలో సోడియం మరియు పొటాషియం నిల్వలు ఎక్కువ. మూత్రపిండాల సమస్య ఉన్నవారు ఈ ఖనిజాలను ఫిల్టర్ చేయలేరు. దీనివల్ల కిడ్నీలపై అదనపు భారం పడి పరిస్థితి విషమిస్తుంది. సముద్రపు ఆహారంలో అయోడిన్ నిల్వలు సహజంగానే ఎక్కువ. థైరాయిడ్ మందులు వాడుతున్న వారు రొయ్యలు ఎక్కువగా తీసుకుంటే, అయోడిన్ మోతాదు పెరిగి హార్మోన్ల అసమతుల్యత ఏర్పడే అవకాశం ఉంది. కిడ్నీ వ్యాధులు - థైరాయిడ్ హెచ్చుతగ్గులు: రొయ్యలలో సోడియం మరియు పొటాషియం నిల్వలు ఎక్కువ. మూత్రపిండాల సమస్య ఉన్నవారు ఈ ఖనిజాలను ఫిల్టర్ చేయలేరు. దీనివల్ల కిడ్నీలపై అదనపు భారం పడి పరిస్థితి విషమిస్తుంది. సముద్రపు ఆహారంలో అయోడిన్ నిల్వలు సహజంగానే ఎక్కువ. థైరాయిడ్ మందులు వాడుతున్న వారు రొయ్యలు ఎక్కువగా తీసుకుంటే, అయోడిన్ మోతాదు పెరిగి హార్మోన్ల అసమతుల్యత ఏర్పడే అవకాశం ఉంది. అలెర్జీలు: చాలామందికి కొన్ని రకాల ఆహార పదార్థాలు పడవు. ముఖ్యంగా సీఫుడ్ అలెర్జీ అనేది ప్రపంచవ్యాప్తంగా చాలా సాధారణం. రొయ్యలు తిన్న కొన్ని నిమిషాల్లోనే చర్మంపై ఎర్రటి దద్దుర్లు, దురద, పెదవులు లేదా కళ్ళు వాచడం వంటివి జరిగితే అది అలెర్జీకి సంకేతం. ఇది తీవ్రమైతే శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది, రక్తపోటు పడిపోతుంది. దీన్నే వైద్య పరిభాషలో అనాఫిలాక్సిస్ అంటారు. సకాలంలో చికిత్స అందకపోతే ఇది ప్రాణాపాయానికి దారితీస్తుంది అలెర్జీలు: చాలామందికి కొన్ని రకాల ఆహార పదార్థాలు పడవు. ముఖ్యంగా సీఫుడ్ అలెర్జీ అనేది ప్రపంచవ్యాప్తంగా చాలా సాధారణం. రొయ్యలు తిన్న కొన్ని నిమిషాల్లోనే చర్మంపై ఎర్రటి దద్దుర్లు, దురద, పెదవులు లేదా కళ్ళు వాచడం వంటివి జరిగితే అది అలెర్జీకి సంకేతం. ఇది తీవ్రమైతే శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది, రక్తపోటు పడిపోతుంది. దీన్నే వైద్య పరిభాషలో అనాఫిలాక్సిస్ అంటారు. సకాలంలో చికిత్స అందకపోతే ఇది ప్రాణాపాయానికి దారితీస్తుంది గుండె సమస్యలు - అధిక కొలెస్ట్రాల్: రొయ్యలలో కొలెస్ట్రాల్ శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. రక్తంలో ఇప్పటికే చెడు కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు లేదా గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారు రొయ్యలను క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తనాళాల్లో పూడికలు ఏర్పడే ప్రమాదం ఉంది. ఇది చివరికి గుండెపోటుకు దారితీయవచ్చు. గుండె సమస్యలు - అధిక కొలెస్ట్రాల్: రొయ్యలలో కొలెస్ట్రాల్ శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. రక్తంలో ఇప్పటికే చెడు కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు లేదా గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారు రొయ్యలను క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తనాళాల్లో పూడికలు ఏర్పడే ప్రమాదం ఉంది. ఇది చివరికి గుండెపోటుకు దారితీయవచ్చు. వండే ముందు ఈ జాగ్రత్త తప్పనిసరి: ఆరోగ్యంగా ఉన్నవారు కూడా రొయ్యలను వండేటప్పుడు ఒక ముఖ్యమైన విషయాన్ని మర్చిపోకూడదు. రొయ్య వెనుక భాగంలో ఉండే నల్లటి నరాన్ని కచ్చితంగా తీసివేయాలి. అది రొయ్య యొక్క విసర్జక పదార్థం. దాన్ని క్లీన్ చేయకుండా తింటే జీర్ణ సమస్యలు, ఫుడ్ పాయిజనింగ్ అయ్యే అవకాశం ఉంటుంది. కాగా ఆరోగ్యానికి మంచిదే కదా అని అతిగా తినడం ఏ ఆహారమైనా ప్రమాదకరమే.





వండే ముందు ఈ జాగ్రత్త తప్పనిసరి: ఆరోగ్యంగా ఉన్నవారు కూడా రొ య్య ల ను వండేటప్పుడు ఒక ముఖ్యమైన విషయాన్ని మర్చిపోకూడదు. రొయ్య వెనుక భాగంలో ఉండే నల్లటి నరాన్ని కచ్చితంగా తీసివేయాలి. అది రొయ్య యొక్క విసర్జక పదార్థం. దాన్ని క్లీన్ చేయకుండా తింటే జీర్ణ సమస్యలు, ఫుడ్ పాయిజనింగ్ అయ్యే అవకాశం ఉంటుంది. కాగా ఆరోగ్యానికి మంచిదే కదా అని అతిగా తినడం ఏ ఆహారమైనా ప్రమాదకరమే.


## ఉదయాన్నే ఖాళీ పొట్టతో ఈ పండ్లు తింటే రోజంతా దిల్ ఖుష్!











ప్రతి ఉదయం ఒక పండు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. రకరకాల పండ్లను తినడం వల్ల శరీరానికి సమతుల్య పోషకాలు అందుతాయి. అందువల్ల బరువును అదుపులో ఉంచుకోవచ్చు. జీర్ణక్రియను మెరుగుపరచుకోవాలనుకునేవారికి పండ్లు మంచి పరిష్కారం. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం లేదు. దీనివల్ల అనేక జీవనశైలి సమస్యలు తలెత్తి, చివరికి ఆస్పత్రుల చుట్టూ తిరగవల్సి వస్తుంది. ముఖ్యంగా ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ తప్పకుండా తీసుకోవాలి. టైం లేకపోతే కనీసం కొన్ని పండ్ల ముక్కలైనా తినాలి. ఇలా ఉదయం పూట పండ్ల ముక్కలు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలను నయం చేయవచ్చు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం లేదు. దీనివల్ల అనేక జీవనశైలి సమస్యలు తలెత్తి, చివరికి ఆస్పత్రుల చుట్టూ తిరగవల్సి వస్తుంది. ముఖ్యంగా ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ తప్పకుండా తీసుకోవాలి. టైం లేకపోతే కనీసం కొన్ని పండ్ల ముక్కలైనా తినాలి. ఇలా ఉదయం పూట పండ్ల ముక్కలు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలను నయం చేయవచ్చు. ఉదయం పూట తినేందుకు అరటిపండ్లు మంచి ఎంపిక. అయితే చాలా మందికి అరటి పండ్లు ఇష్టం ఉండవు. కానీ అవి అత్యంత వేగంగా శక్తినిచ్చే పండ్లు. వాటిలోని పొటాషియం, కార్బోహైడ్రేట్లు శరీరాన్ని చురుకుగా ఉంచడానికి సహాయపడతాయి. ఖాళీ కడుపుతో అరటిపండ్లు తినడం వల్ల మలవిసర్జన క్రమబద్ధమై, మలబద్ధకం నివారణకు సహాయపడుతుంది. ఉదయం పూట తినేందుకు అరటిపండ్లు మంచి ఎంపిక. అయితే చాలా మందికి అరటి పండ్లు ఇష్టం ఉండవు. కానీ అవి అత్యంత వేగంగా శక్తినిచ్చే పండ్లు. వాటిలోని పొటాషియం, కార్బోహైడ్రేట్లు శరీరాన్ని చురుకుగా ఉంచడానికి సహాయపడతాయి. ఖాళీ కడుపుతో అరటిపండ్లు తినడం వల్ల మలవిసర్జన క్రమబద్ధమై, మలబద్ధకం నివారణకు సహాయపడుతుంది. యాపిల్ పండ్లు కూడా ఉదయం పూట తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. యాపిల్ పండ్లలోని ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. ఉదయాన్నే ఒక యాపిల్ పండు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి, శరీరం శుభ్రంగా ఉండటానికి సహాయపడుతుంది. యాపిల్ పండ్లు కూడా ఉదయం పూట తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. యాపిల్ పండ్లలోని ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. ఉదయాన్నే ఒక యాపిల్ పండు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి, శరీరం శుభ్రంగా ఉండటానికి సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో బొప్పాయి ముఖ్య పాత్ర పోషిస్తుంది. దీనిలోని ఎంజైమ్‌లు ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడానికి సహాయపడతాయి. కాబట్టి దీనిని ఉదయం పూట తీసుకోవడం చాలా ప్రయోజనకరం. ఇది శరీరం నుం విష పదార్థాలను తొలగించి, చర్మ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో బొప్పాయి ముఖ్య పాత్ర పోషిస్తుంది. దీనిలోని ఎంజైమ్‌లు ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడానికి సహాయపడతాయి. కాబట్టి దీనిని ఉదయం పూట తీసుకోవడం చాలా ప్రయోజనకరం. ఇది శరీరం నుం విష పదార్థాలను తొలగించి, చర్మ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. ఉదయాన్నే పుచ్చకాయ ముక్కలు కూడా తినవచ్చు. ఉదయాన్నే అధిక నీటి శాతం ఉన్న పండ్లను తినడం వల్ల శరీరాన్ని చల్లగా ఉంచడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా వేసవిలో ఇది శరీరంలో డీహైడ్రేషన్‌ను నివారించడంలో సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో ఈ పండ్లను తినడం శరీరంలో ఒంట్లో నీటి శాతాన్ని కాపాడి, అలసటను తగ్గిస్తుంది. ఉదయాన్నే పుచ్చకాయ ముక్కలు కూడా తినవచ్చు. ఉదయాన్నే అధిక నీటి శాతం ఉన్న పండ్లను తినడం వల్ల శరీరాన్ని చల్లగా ఉంచడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా వేసవిలో ఇది శరీరంలో డీహైడ్రేషన్‌ను నివారించడంలో సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో ఈ పండ్లను తినడం శరీరంలో ఒంట్లో నీటి శాతాన్ని కాపాడి, అలసటను తగ్గిస్తుంది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com